క్లుప్తంగా

మందాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



మందాలమ్మ ఆలయాభివృద్ధికి మొదటి నెల జీతం విరాళంగా అందిస్తున్న శివతేజ కుటుంబ సభ్యులు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి వడలికి చెందిన గంగా వెంకట శివతేజ్ మొదటి నెల జీతాన్ని విరాళంగా అందించారు. ఆదివారం వడలి మందాలమ్మ ఆలయ ప్రాంగాణంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 87,989 విరాళంగా అందించారు. దాతల విరాళాన్ని అమ్మవారి వెండి వస్తువుల తయారీకి వినియోగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంగా రామకృష్ణ, నాగమణి, గంగా శ్రీలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నరసాపురం: పది గంటల పని విధానాన్ని తీసుకొచ్చే నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మీరా గ్రంథాలయ భవనంలో నిర్వహించిన బజారుజట్ల కార్మికసంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలతో తెచ్చుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులకు కీడుచేసే లేబర్‌కోడ్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్నాయని అన్నారు. నూతన లేబర్‌కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు సమ్మె చేసే అవకాశం కూడా కోల్పోతారని చెప్పారు. నూతన లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ బుధవారం నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మల్లిడి దుర్గారావు, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాలకొల్లు సెంట్రల్: గురుపౌర్ణమి పండుగ నాడు ఆరాధించేది శ్రీకృష్ణ భగవానుడిని మాత్రమేనని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అన్నారు. ఆదివారం బల్లిపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బుధవారం గురుపౌర్ణమి పురస్కరించుకుని శ్రీకృష్ణ భగవానుడిని మాత్రమే పూజించాలని సూచించారు. దేవుడు మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అనాలని, ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండడం వల్ల గురుపౌర్ణమిగా నిర్ణయించి శ్రీకృష్ణుడు మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవ, రాజు, సత్యనారాయణ, శ్రీకర, చైతన్య, లోకేష్, హనుమంతరావు, దుర్గ, భవాని, తారకేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా ఏకలవ్య జయంతి

పెనుగొండ: ఏకలవ్య జయంతి వేడుకలు ఆచంట మండలం వల్లూరు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఏకలవ్య సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఏకలవ్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులతో పాటు, చిట్టూరి శ్రీనివాస్, కడిమి ఉమామహేశ్వరస్వామి, తోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలందర్ రేవులో వసతులు కరువు

నరసాపురం : నిత్యం రద్దీగా ఉండే వశిష్టా గోదావరి వలందర్ రేవులో కనీస వసతులు లేక అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో గోదావరి వలందర్ రేవు ప్రధానమైంది. కర్మకాండలు, పూజలు నిమిత్తం దూరప్రాంతాల నుంచి నిత్యం రేవుకు అనేక మంది వస్తుంటారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో భక్తులు రేవులో స్నానాలు చేస్తారు. కానీ రేవులో కనీస వసతులు మాత్రం లేవు. ముఖ్యంగా రేవును శుభ్రం చేయడం లేదు. దీంతో రేవు నిండా బురద పేరుకుపోతుంది. దీంతో స్నానాలకు దిగిన భక్తులు రేవులో కాళ్ళు జారి పడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందోనని భక్తులు భయాందోళనలు చెందుతున్నారు. రేవులో అస్తికలు కలిపిన కుండలు వంటివి ఎప్పటికప్పుడు తీయకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రేవులో 6 అడుగులు దూరం దాటి వెళితే చాలా లోతు ఉంటుంది.



అసౌకర్యాల మధ్య అధ్వానంగా ఉన్న నరసాపురం వశిష్టా వలందర్ రేవు

గతంలో అనేక ప్రమాదాలు..

గతంలో అనేక మంది రేవులో గల్లంతైన సంఘటనలు జరిగాయి. 2012లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఇలానే రేవులో కాలుజారి పడి ప్రాణాలు పోగొట్టుకుంది. అప్పట్లో విమర్శలు రావడంతో మునిసిపల్ అధికారులు స్పందించారు. రేవులో రక్షణగా సిమెంట్ స్తంభాలు పాతి, కంచె ఏర్పాటు చేశారు. తరువాత 2015 పుష్కరాల సమయంలో రేవులో కొద్దిపాటి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం కంచె శిథిలమైయ్యింది. దీంతో రేవులో ప్రస్తుతం ప్రమాదాలు జరగొచ్చని భక్తుల ఆందోళన చెందుతున్నారు. సముద్రపు పోటు స్థానికంగా రేవులో నీరు ఎక్కువగా ఉంటుంది. పాటు సమయంలో రేవులో నీరు లేకపోతే అక్కడి అధ్వాన్న పరిస్థితులు పైకి పూర్తిగా కన్పిస్తాయి. ముఖ్యంగా రేవులో తాగునీటికి సంబంధించి ఓ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ప్రజల నుంచి ఉంది. ఈ విషయంలో గతంలో మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు గానీ, కుళాయి మాత్రం ఏర్పాటు చేయలేదు. కనీసం రేవు వద్ద తాగడానికి మంచినీళ్ల కూడా అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇప్పుడైనా రేవులో మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చర్చిలో పాస్టర్ల బాహాబాహీ

నరసాపురం: పట్టణలలోని మొగల్తూరు రోడ్డులో ఉన్న ప్రసిద్ధ లూథరన్ చర్చిలో ఇద్దరు పాస్టర్ల మధ్య మొదలైన వాగ్వివాదం చివరకు ఉద్రిక్తతకు దారి తీసింది. ఇద్దరు పాస్టర్లు వారి అనుచరులు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. చర్చిలోనే ఒకరికొకరు తోసుకుని కొట్లాటకు దిగడంతో ఆదివారం ప్రార్ధనకు చర్చికి వచ్చిన భక్తులు భయాందోళనతో పరుగులు తీశారు. పాస్టర్లు చంద్రశేఖర్, నవకుమార్ మధ్య ఎవరు చర్చిలో ప్రార్థన చేయాలనే అంశంపై గొడవ మొదలైంది. చర్చి కమిటీ సభ్యులు కూడా రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడడంతో భక్తులు షాక్ తిన్నారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉంటే కొంతకాలంగా పాస్టర్ల మధ్య ఆధిపత్య పోరు, కమిటీలో లుకలుకలు కారణంగా చర్చి వ్యవహారాలు చర్చనీయాంశమయ్యాయి. వందేళ్ల చరిత్రఉన్న చర్చిలో ఇలాంటి ఘటనలు జరగడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పెనుగొండ: కొఠాలపర్రులో ఆకట్టుకున్న కేశవస్వామి అలంకరణ



యలమంచిలి: అబ్బిరాజుపాలెంలో ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి



యలమంచిలి: ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి



యలమంచిలి: కొంతేరు శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కళాశాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



పెనుమంట్ర: ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి



పెనుమంట్ర: జుత్తిగలో శ్రీలక్ష్మీ జనార్దన స్వామిని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తున్న యువకులు

పాలకొల్లు సెంట్రల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఉన్న విష్ణాలయాలు, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామి, చినగోపురంలో శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి, కెనాల్ రోడ్డులో శ్రీ పద్మావతి అలివేలు మంగా సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ దాసోహాంజనేయస్వామి, చినబజారు శ్రీ వేంకటేశ్వరస్వామి, బుధవారపు వీధి రామాలయం, యడ్లబజారు సెంటర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను పుష్పాలు, తులసి దళాలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి.

పెనుగొండలో..

పెనుగొండ: తొలి ఏకాదశి పూజలు ఆదివారం పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రెండో శ్రీరంగంగా పేరు గాంచిన కొఠాలపర్రు కేశవ స్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి పూజలు, అభిషేకాలువైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు కేశవ స్వామిని దర్శించుకున్నారు. పెనుగొండ చెరుకువాడలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోని ఉపాలయం వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, సిద్ధాంతం, చినమల్లం, ఆచంట, కోడేరు, పెనుమంచిలిల్లోనూ తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం కొంతేరు గ్రామంలోని శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోనూ, యలమంచిలి కేశవస్వామి ఆలయంలోను, అబ్బిరాజుపాలెం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. కొంతేరులో ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో స్వామివారికి 108 కళాశాలతో సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. యలమంచిలి కేశవస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి గోపి ఆధ్వర్యంలో దేవేరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసితో సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అబ్బిరాజుపాలెం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం, అర్చన చేశారు. చతుర్మాస పూజలో భాగంగా ఆదివారం కోటి అష్టాక్షరి, ద్వాదశక్షరిమంత్ర జపం ప్రారంభించారు. ఈ పూజలు నవంబర్ రెండో తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, ఎల్బీచర్ల, వేములదీవి, దర్బరేవు, కొప్పర్రు, చిట్టవరం గ్రామాల్లోని పలు ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వేములదీవి పడమర గ్రామంలోని కాపులకొడపలో వేంచేసి ఉన్న శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

పెనుమంట్ర: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వివిధ దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. మార్టేరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఉదయం స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సత్తి వెంకట చైతన్యరెడ్డి, రూన్సీదేవి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జుత్తిగ శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీలక్ష్మీ జనార్ధన స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు నల్లమిల్లి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. మార్టేరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ వెలగల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్



పాలకొల్లు సెంట్రల్: కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ జి.సత్యనారాయణ



పెనుగొండ: యాంటీ రేబిస్ టీకాలను ప్రారంభిస్తున్న పెనుగొండ సర్పంచ్ శ్యామలా సోనీ శాస్త్రి



నరసాపురం రూరల్: కుక్కలకు ఉచిత టీకాలు వేస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ డాక్టర్ ఇంజేటి సురేంద్రకుమార్

పాలకొల్లు సెంట్రల్: జంతువులతో మానవుని సహచర్యం ఎంతో ప్రాచీనమైనదని వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు రేబిస్ నివారణా టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పశుపక్ష్యాదుల నుంచి మానవులకు అనేక వ్యాధులు సంక్రమిస్తాయని ఈ వ్యాధులనే జునోటిక్ వ్యాదులు అంటారన్నారు. జంతువుల్లో రేబిస్, మెదడువాపు, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, బ్రూసెల్లోసిస్, క్షయ, నెరుడు, దొమ్మవాపు (ఆంత్రాక్స్), లెప్టోస్పైరోసిస్, తామర, హైడాటిడోసిస్ వంటి ఈ వ్యాధులు 280 వరకూ ఉన్నాయన్నారు. లూయిస్ పాశ్చర్ అను శాస్త్రవేత్త మొదటిసారి 1885 జులై 6వ తేదిన పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి రేబిస్ వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా వేశారన్నారు. అది విజయవంతం కావడంతో ఆ రోజును ప్రపంచ జునోసిస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. జంతువులకు జునోసిస్ వ్యాధులు రాకుండా సకాలంలో టీకాలు వేయించాలన్నారు. సుమారు 350 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు కుక్కలకు టీకాలు వేయించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు శిడగం సతీష్, మునిసిపల్ ఆర్ఐ బదరీ, యలమంచిలి మండల వెటర్నరీ వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు జయదుర్గాదేవి, మోటూరి మణికంత, జీవీ, జిల్లా జంతు సంక్షేమ సంఘం సభ్యులు రావూరి గణేష్ టీం సభ్యులు, ఎల్ఎస్ఏ సతీష్‌రెడ్డి, నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యుడు మనీష్ గౌడ్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండ, ఆచంట వండలాల్లో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం నిర్వహించారు. పెనుగొండలోని ప్రాంతీయ పశువైద్యశాలలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ శిబిరాన్ని సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి ప్రారంభించారు. పెంపుడు జంతువులు ఉన్న వారందరూ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్య శాల ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ కంఠమణి భాను తేజ, డాక్టర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: పశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, పాడిరైతులు ఆ సేవలను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ డాక్టర్ ఇంజేటి సురేంద్రకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఏరియా పశు వైద్యశాల ప్రాంగణంలో ఆదివారం జునోసిస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 250 కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది అంజిరెండ్డి, పుష్ప యాంజిల్, వి.కాంచనగంగ, నారా సాయి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఎక్సైజ్ వ్యవస్థ నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

పెనుమంట్ర: కల్తీ మద్యం, అక్రమ మద్యం, అరికట్టలేని అక్రమ బెల్టు షాపులు తొలగించలేని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఉన్నా లేకున్నా ఒకటేనని, కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థ నిర్వీర్యమైందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పెనుమంట్ర మండల సొసైటీ ప్రెసిడెంట్ల సమావేశం బ్రాహ్మణ చెరువు రైతు సంఘం కార్యాలయంలో కడలి బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి వీధిలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. బెల్టు షాపులు వల్ల తాటికల్లు అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపిందని విమర్శించారు. ఎక్సైజ్ వారికి ప్రభుత్వానికి తెలియకుండా కల్తీ మద్యం అక్రమ మద్యం వరదలా వస్తుందా? అని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు తొలగించి కల్లు గీత కుటుంబాలను ఆదుకోమని 14న కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్నామన్నారు. గీత కార్మికులు మోకులు ధరించి రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గుబ్బల పాటేశ్వరరావు, కంకటాల నాగేశ్వరరావు, బొక్కా కృష్ణ, కొరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు శాకంబరి అలంకరణ



నరసాపురం రూరల్: శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ముచ్చర్లవారి పుంతలో ఉన్న శ్రీ కొండాల మ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆదివారం ఆషాఢం మాసం తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిగా అలకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో న్న శ్రీ కనకదుర్గమ్మ వారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యే క పూజలుచేశారు. తహసీల్దార్ కార్యాలయ మహిళా ఉద్యోగులు ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు.

భర్తపై కేసు నమోదు

భీమవరం: భర్త వేధిస్తున్నాడంటూ భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గాపురం ప్రాంతానికి చెందిన ఎ నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎస్ స్వామి చెప్పారు. నర్సమ్మకు దుర్గాపురానికి చెందిన మావుళ్లుకు 20 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. ఆదివారం భార్యభర్తల మధ్య వివాదం ఏర్పడడంతో మావుళ్ల నర్సమ్మను తలపై కొట్టడంతో గాయపడింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీఐ కె బలరామరాజు ఆదేశాల మేరకు ఆదివారం తుందుర్రు గ్రామంలో ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఎమ్ శ్రీనివాసరావు బెల్టు షాపు నిర్వహిస్తుండటంతో అతడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.